సాక్షి
కామారెడ్డి

గురువారం । 27 । జూన్ । 2024



అన్ని రంగాల్లో రాణించాలి
విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు సూచించారు.
- 9లో ▸



ఆర్థికంగా అభివృద్ధి చెందాలి
మహిళా సంఘాల సభ్యులకు రుణాలు ఇప్పించి ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చూడాలని సెర్ప్ డీపీఎం సూచించారు.
- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
37.2 /24.9

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అడపాదడపా జల్లులు కురిసే అవకాశాలున్నాయి. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురియవచ్చు.

న్యూస్‌రీల్

‘అమ్మ పేరిట మొక్క’ల పంపిణీ



కామారెడ్డి టౌన్: శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం జిల్లాకేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ‘అమ్మ పేరిట ఒక మొక్క’ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యకర్తలకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి ఉత్సవాలలో భాగంగా దేశవ్యాప్తంగా ప్రతి బీజేపీ కార్యకర్త ఒక మొక్క నాటాలని పార్టీ సూచించిందన్నారు. ప్రతి కార్యకర్త మొక్కను నాటిన తర్వాత అమ్మతో కలిసి ఫొటో దిగాలని సూచించారు. అమ్మ విషయంలో ఎంత జాగ్రత్త చూపుతామో అదేవిధంగా ఆ మొక్కకు కూడా చూసుకోవాలనేది కార్యక్రమ ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు విపుల్, అసెంబ్లీ కన్వీనర్ కుంట లక్ష్మారెడ్డి, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ శ్రీకాంత్, పట్టణ అధ్యక్షుడు భరత్, కౌన్సిలర్ నరేందర్, నాయకులు వేణు, రమణ, నక్కరాజు, రాజగోపాల్, ప్రవీణ్, అంబరీష్, సంతోష్ గౌడ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

‘పాఠశాలల బంద్ విజయవంతం’

కామారెడ్డి టౌన్: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం బుధవారం నిర్వహించిన బంద్ జిల్లాలో విజయవంతమైందని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ రోహిత్ తెలిపారు. బుధవారం ఆయన జిల్లా కేంద్రంలో ప్రభుత్వ బాలుర పాఠశాల ఆవరణలో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ బంద్ నిర్వహించామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ, స్కావెంజర్ పోస్టులను భర్తీ చేయాలని, ప్రైవేట్ విద్యాసంస్థలలో ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

సివిల్ సర్వీసెస్‌లో కోచింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: సివిల్ సర్వీసెస్‌కు సంబంధించి లాంగ్ టర్మ్(ప్రిలిమ్స్ కమ్ మెయిన్స్) కోచింగ్ కోసం వచ్చేనెల 3వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని సైదాబాద్ లక్ష్మీనగర్ కాలనీలోగల బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ ఇవ్వనున్నారని పేర్కొన్నారు. 150 సీట్లలో వంద కొత్త వారికి, 50 ఇదివరకే సివిల్స్ ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణులైన వారికి అవకాశం కల్పిస్తారని తెలిపారు. ఇతర వివరాలకు 08462-241055 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో..
తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో సివిల్ సర్వీసెస్ పరీక్షలకు పది నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ విషయాన్ని జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి రజిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీవర్గాలవారు వచ్చేనెల 10 వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

గ్రూప్–2 గ్రాండ్ టెస్టులకు..
కామారెడ్డి అర్బన్: గ్రూప్ -2 శిక్షణకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు వచ్చేనెల 8 నుంచి 31వ తేదీ వరకు నాలుగు దశలలో ఆఫ్‌లైన్ గ్రాండ్ టెస్టులను నిర్వహించనున్నారు. ఆసక్తిగలవారు వచ్చేనెల 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ బీసీ స్టడీ సర్కిల్‌లో మొదటి గ్రాండ్ టెస్ట్ జూలై 8, 9 తేదీలలో, రెండోది 15, 16 తేదీలలో, మూడిది 22, 23 తేదీలలో, నాలుగోది 30, 31 తేదీలలో నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 08562-241055 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

29న జిల్లా స్థాయి పోటీలు


కామారెడ్డి టౌన్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాలలో భాగంగా జిల్లాలోని 8, 9 తరగతుల విద్యార్థులకు ఈనెల 29న పలు అంశాలలో పోటీలు నిర్వహించనున్నారు. పోస్టర్ మేకింగ్, కవితా రచన అంశాలలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు డీఈవో ఎస్.రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని హౌజింగ్ బోర్డు కాలనీలోగల భవిత హైస్కూల్‌లో ఉదయం 10 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. భూముల పునరుద్ధరణ, కాలుష్య కోరల్లో నేటి మానవ మనుగడ అంశాలపై పోటీలు ఉంటాయని తెలిపారు. ఇతర వివరాలకు జిల్లా సైన్స్ అధికారి సిద్దిరాంరెడ్డిని 94404 14250 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రంజుగా బాన్సువాడ రాజకీయం

- కాంగ్రెస్‌లో కాకరేపిన పోచారం చేరిక
- తాను ఇక్కడే ఉంటానంటున్న ఏనుగు
- నియోజక వర్గ ఇన్‌చార్జి ఎవరన్న దానిపై శ్రేణుల్లో చర్చ







సాక్షి, కామారెడ్డి: బాన్సువాడ నియోజకవర్గంలో రాజకీయాలు రసవత్తరంగా మారాయి. ముఖ్యంగా అధికార కాంగ్రెస్ పార్టీలో ఇటీవల చోటుచేసుకుంటున్న పరిణామాలు ఆసక్తి రేకెత్తిస్తున్నాయి. స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డితో పాటు ఆయన తనయులు ఇటీవల బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. ఆయన పార్టీ మారుతారని ముందుగానే ప్రచారం జరగడంతో నియోజకవర్గంలోని కాంగ్రెస్ శ్రేణులు నిరసనలకు దిగాయి. ఆయనను చేర్చుకోవద్దని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని పార్టీ నేతలు రాష్ట్ర నాయకులు, మంత్రులను కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. అయితే బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలను తమవైపు తిప్పుకోవడంలో భాగంగా కాంగ్రెస్ నాయకత్వం పోచారం శ్రీనివాస్‌రెడ్డికి పార్టీ కండువా కప్పేసింది. ఈ నేపథ్యంలో ఇంతకాలం కాంగ్రెస్‌లో కొనసాగిన నేతలంతా అయోమయంలో పడ్డారు. నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డిని కలిసి తమ భవిష్యత్తు గురించి ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన వారికి భరోసా ఇచ్చారు. తాను బాన్సువాడలో ఇళ్లు కట్టుకుని పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని, ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదని ఆయన కార్యకర్తల సమావేశంలో స్పష్టం చేశారు.

గ్రూపుల గొడవ తప్పదా?
బాన్సువాడ కాంగ్రెస్‌లో ఇప్పటికే రెండు ప్రధాన గ్రూపులున్నాయి. అసెంబ్లీ టికెట్టు ఆశించి భంగపడ్డ కాసుల బాల్‌రాజు అనుచరులు ఒక వర్గంగా, ఏనుగు రవీందర్‌రెడ్డి అనుచరులు మరో వర్గంగా విడిపోయారు. కాగా చివరి నిమిషంలో టికెట్టు తెచ్చుకుని బాన్సువాడనుంచి పోటీ చేసిన ఏనుగు రవీందర్‌రెడ్డి నియోజకవర్గంలో పట్టుకోసం ప్రయత్నించారు. కాంగ్రెస్ గాలి వీస్తున్న క్రమంలో విజయం సాధించాలన్న పట్టుదలతో శ్రమించారు. అయితే ఆయనకు ఓటమి తప్పలేదు. ఎన్నికల తర్వాత నియోజకవర్గ బాధ్యతలను తనే చూస్తూ వస్తున్నారు. ఆయన పార్లమెంటు ఎన్నికల నాటికి నియోజకవర్గంపై పట్టు సాధించారు. పార్టీ ఎంపీ అభ్యర్థికి మెజారిటీ రావడంలో కీలక భూమిక పోషించారు. అయితే నియోజకవర్గంలో రెండు గ్రూపులుగా కొనసాగుతున్న క్రమంలో పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడంతో మరో గ్రూప్ తయారవుతుందా అన్న అంశంపై జోరుగా చర్చ జరుగుతోంది. పోచారం రాకను వ్యతిరేకిస్తున్న రవీందర్‌రెడ్డి గ్రూపు ఆయనతో జతకట్టే పరిస్థితి కనిపించడం లేదు. కాసుల బాల్‌రాజు గ్రూపు పోచారంతో కలిసిపోతుందా? లేదా ప్రత్యేకంగా కొనసాగుతుందా అన్నది భవిష్యత్‌లో తేలనుంది.

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన తర్వాత గెలిచిన సీట్లలో ఎమ్మెల్యేలు ఇన్‌చార్జీలుగా ఉన్నారు. ప్రత్యర్థి పార్టీ ఎమ్మెల్యేలు ఎన్నికైన స్థానాల్లో ఓడిన నాయకులే ఇన్‌చార్జీలుగా కొనసాగుతూ వస్తున్నారు. బాన్సువాడలో

బాధ్యతలు ఎవరికో..
అసెంబ్లీ ఎన్నికల తర్వాత నుంచి ఇన్‌చార్జీగా ఏనుగు రవీందర్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు. అయితే సిట్టింగ్ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో పరిస్థితి మారిపోయింది. ఎమ్మెల్యేగా పోచారం శ్రీనివాస్‌రెడ్డికే ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తారా? లేక ఇప్పటిదాకా ఇన్‌చార్జీగా వ్యవహరిస్తున్న ఏనుగు రవీందర్‌రెడ్డిని కొనసాగిస్తారా? అన్న అంశంపై పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఏనుగు రవీందర్‌రెడ్డిని తప్పించి పోచారం తనయుడు భాస్కర్‌రెడ్డికి బాధ్యతలు అప్పగిస్తారన్న ప్రచారమూ జరుగుతోంది. దీంతో రవీందర్‌రెడ్డి అనుచరుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



కిసాన్ మేళా కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సంగ్వాన్, డెయిరీ టెక్నాలజీ కళాశాల డీన్ శరత్ చంద్ర, శాస్త్రవేత్త బస్వారెడ్డి, డీవీఏహెచ్‌వో సింహారావు, డీఏవో భాగ్యలక్ష్మి

- వ్యవసాయంతోపాటు అనుబంధ రంగాలపై దృష్టి సారించాలి
- కిసాన్ మేళాలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి అర్బన్: ప్రభుత్వం అందిస్తున్న రుణాలు, రాయితీలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. హైదరాబాద్‌కు చెందిన జాతీయ మాంస పరిశోధన సంస్థ(ఎన్ఎంఆర్ఐ), కామారెడ్డిలోని డెయిరీ టెక్నాలజీ కళాశాల ఆధ్వర్యంలో బుధవారం జిల్లాకేందంలోని కళాభారతిలో కిసాన్ మేళా నిర్వహించారు. వ్యవసాయ అనుబంధ ప్రదర్శనశాలలను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించడానికి వ్యవసాయంతో పాటు అనుబంధంగా లాభదాయక పంటలు, కూరగాయలు, పండ్ల తోటలు, పాడిపరిశ్రమ, కోళ్లు, చేపలు, గొర్రెలు, మేకల పెంపకం చేపట్టాలని సూచించారు. రైతులు వ్యవసాయంలో అధునిక పద్ధతులు అవలంబించాలన్నారు. ఆయిల్‌పాం తోటలకు ప్రభుత్వం ఇస్తున్న రాయితీలను వినియోగించుకోవాలన్నారు. జాతీయ మాంస పరిశోధన సంస్థ డైరెక్టర్ ఎస్‌బీ బర్బుదే, శాస్త్రవేత్త పి.బస్వారెడ్డి మాట్లాడుతూ మేలు జాతి గొర్రెలు, మేకల మాంసానికి రాష్ట్రంలో విపరీతమైన డిమాండ్ ఉందన్నారు. జీవాలకు మంచి ధర లభిస్తున్నందున రైతులు వాటి పెంపకంపై దృష్టి సారించాలన్నారు. తమ పరిశోధన సంస్థ ద్వారా రైతులు, మహిళల ఆదాయాలను పెంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. నాణ్యమైన పాలకు స్థానికంగా మంచి మార్కెట్ ఉందని, పాలను ఎక్కువ ధర ఉన్న చోట అమ్ముకోవాలని డెయిరీ టెక్నాలజీ కళాశాల డీన్ శరత్ చంద్ర సూచించారు. ఆసక్తిగల పాడి రైతులకు పాల ప్రాసెసింగ్, ఉప ఉత్పత్తుల తయారీ విధానం, నైపుణ్యాల పెంపుదల కోసం సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో రైతుల సందేహాలను పాడి, పశు సంవర్ధకశాఖ, జాతీయ మాంస పరిశోధన సంస్థల అధికారులు నివృత్తి చేశారు. కార్యక్రమంలో కోరుట్ల పశువైద్యశాల డీన్ డి.శ్రీనివాస్, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి సింహారావు, జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి, విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ నందకుమారి, డెయిరీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, రైతులు పాల్గొన్నారు.

కార్యకర్తలు అధైర్యపడొద్దు



కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి

- బాన్సువాడలోనే ఉంటా
- మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి

బాన్సువాడ: కాంగ్రెస్ కార్యకర్తలు అధైర్యపడొద్దని పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. అధిష్టానం తీసుకున్న నిర్ణయాలకు కట్టుబడి ఉండాలన్నారు. బుధవారం ఆయన బాన్సువాడ, బీర్కూర్ మండల కేంద్రాల్లో కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరినప్పటి నుంచి బాన్సువాడలో జరుగుతున్న సంఘటనలకు కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారన్నారు. తాను ఎక్కడికీ వెళ్లనని, బాన్సువాడలోనే ఉంటానని పేర్కొన్నారు. తాను నాలుగుసార్లు ఎమ్మెల్యేగా పనిచేశానని, బాన్సువాడ కార్యకర్తలు చూపిన ఆదరణ, ప్రేమ, ఆప్యాయతలను ఎక్కడా చూడలేదని పేర్కొన్నారు. బాన్సువాడలోనే ఇల్లు కట్టుకుని నిత్యం కార్యకర్తలకు అందుబాటులో ఉంటానన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కొత్తకొండ భాస్కర్, ఎలమంచలి శ్రీనివాస్‌రావు, చంద్రశేఖర్‌రెడ్డి, ఉద్దెర హన్మండ్లు, వెంకట్‌రాంరెడ్డి, లాయక్, అక్బర్, రహీం, మంత్రి గణేష్, నార్ల రఘు తదితరులు పాల్గొన్నారు.

‘మధ్యాహ్నం’ ఇబ్బందులు

- మూడు నెలలుగా అందని బిల్లులు
- అప్పుల పాలవుతున్నామంటున్న ఏజెన్సీల నిర్వాహకులు
- బకాయిలు చెల్లించాలని డిమాండ్



జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఏజెన్సీ నిర్వాహకులు

కామారెడ్డి టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ నిర్వాహకులకు భారంగా మారింది. మూడు నెలలుగా బిల్లులు మంజూరు కాకపోవడంతో నిర్వాహకులు అప్పులపాలవుతున్నారు. జిల్లాలో 1,011 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. అన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలవుతోంది. విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం అందించేందుకు 1,500 మంది ఏజెన్సీ నిర్వాహకులు పనిచేస్తున్నారు. కాగా ఏజెన్సీ నిర్వాహకులకు మూడు నెలలుగా బిల్లులు మంజూరు కావడం లేదు. జిల్లాలో రూ. 1.60 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. బిల్లులు సకాలంలో రావడం లేదని, విద్యార్థుల ఆకలి తీర్చేందుకు అప్పులు చేయాల్సి వస్తోందని ఏజెన్సీల నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగలు తాకట్టు పెట్టి అడ్డగోలు వడ్డీలకు అప్పులు తెచ్చి పథకాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొంటున్నారు. వెంటవెంటనే బిల్లులు మంజూరయ్యేలా చూడాలని కోరుతున్నారు. పథకానికి సంబంధించి అడ్వాన్స్‌లు చెల్లించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఏళ్లుగా మారని స్లాబ్ రేటు..
ప్రస్తుతం మార్కెట్‌లో అన్ని వస్తువుల ధరలు పెరిగాయి. నిత్యావసర సరుకులతో పాటు గుడ్లు, కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయి. ఏటా 7.5 శాతం స్లాబ్ రేటును పెంచాల్సి ఉంది. కానీ ప్రభుత్వం మాత్రం వీరికి మూడేళ్ల కిత్రం ఉన్న స్లాబ్ రేటు ప్రకారమే బిల్లులు చెల్లిస్తోంది. ఇప్పటికీ ప్రైమరీ విద్యార్థులకు ఒక్కొక్కరికి భోజనానికి రూ. 5.45, హైస్కూల్ విద్యార్థులకు రూ. 7.80 చొప్పున చెల్లిస్తోంది. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో టమాట ధర రూ. 60, పప్పులు కిలోకు రూ. 120కిపైనే ఉన్నాయి. ఆకుకూరలు, కాయగూరల పరిస్థితీ ఇంతే.. మార్కెట్‌లో కోడిగుడ్డు ధర రూ. 7 ఉండగా.. ప్రభుత్వం రూ. 5 మాత్రమే ఇస్తోంది. ఉదయం టిఫిన్, జావా కోసం రవ్వ ఉచితంగా సరఫరా చేస్తున్నా.. వండి ఇచ్చినందుకు ఎలాంటి పారితోషికం ఇవ్వడం లేదు. నిర్వాహకులకు గౌరవ వేతనం రూ. 3 వేలకు పెంచుతామని చెప్పినా వెయ్యి రూపాయల చొప్పునే ఇస్తున్నారు. ప్రభుత్వం స్పందించి స్లాబ్ రేటు, గౌరవ వేతనం పెంచాలని, బిల్లులను వెంటవెంట మంజూరు చేయాలని ఏజెన్సీల నిర్వాహకులు కోరుతున్నారు.

స్లాబ్ రేటు పెంచాలి



నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగాయి. అయినా మధ్యాహ్న భోజన పథకం స్లాబ్ రేటు మార్చడం లేదు. ఏటా 7.50 శాతం స్లాబ్‌రేటు పెంచాలని జీవో ఉన్నా అమలు చేయడం లేదు. స్లాబ్ రేటు పెంచడంతోపాటు రూ. 10 వేల కనీస వేతనం ఇవ్వాలి.
– వెంకటేష్, ఎండీఎం సంఘం జిల్లా అధ్యక్షుడు, భిక్కనూరు

అప్పులు తెచ్చి వండిపెడుతున్నం



మూడు నెలలుగా మధ్యాహ్న భోజన పథకం బిల్లులు రావడం లేదు. మాకు లక్ష రూపాయల వరకు రావాల్సి ఉంది. బిల్లులు రాకపోవడంతో అప్పులు చేయాల్సి వస్తోంది. రూ. 3 వడ్డీకి అప్పులు తెచ్చి విద్యార్థులకు వండి పెడుతున్నా. ప్రతి నెలా అడ్వాన్స్‌గా బిల్లులు ఇవ్వాలి.
– సరస్వతి, ఎండీఎం నిర్వాహకురాలు, జుక్కల్

ప్రభుత్వానికి నివేదించాం



మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ విషయాన్ని ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. నిధులు మంజూరు కాగానే ఏజెన్సీల నిర్వాహకులకు బిల్లులు చెల్లిస్తాం. కార్మికుల సమస్యలను సైతం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం.
– ఎస్.రాజు, డీఈవో, కామారెడ్డి

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ సింధు శర్మ, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, పోలీస్ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

- ఎస్పీ సింధు శర్మ
- జిల్లాకేంద్రంలో అవగాహన ర్యాలీ

కామారెడ్డి క్రైం: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్పీ సింధు శర్మ సూచించారు. బుధవారం జిల్లాకేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కామారెడ్డిలోని సాందీపని జూనియర్ కళాశాల వద్ద ఎస్పీ సింధు శర్మ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కొత్త బస్టాండ్ నుంచి నిజాంసాగర్ చౌరస్తా వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. డ్రగ్స్‌కు అలవాటు పడితే విద్యార్థులకు భవిష్యత్తు ఉండదన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలు కాకుండా ఉండేందుకు తల్లిదండ్రులు, అధ్యాపకులు దృష్టి సారించాలన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఎవరైనా మాదక ద్రవ్యాలు స్వీకరించినా, రవాణా చేసినా, విక్రయాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వర్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, ఐఎస్ఆర్‌డీ స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి అమృత రాజేందర్, సీఐలు చంద్రశేఖర్‌రెడ్డి, రామన్, మిషన్ పరివర్తన కమ్యూనిటీ ఎడ్యుకేటర్స్ మోసర్ల శ్రీకాంత్‌రెడ్డి, సుమన్, ఎక్సైజ్, ఐసీడీఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ డాక్టర్ల సమ్మె విరమణ


- మంత్రితో చర్చలు సఫలం

నిజామాబాద్‌నాగారం: జిల్లాలో జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న సమ్మెను విరమించారు. బుధవారం రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజానర్సింహ వద్ద జూడా అసోసియేషన్ రాష్ట్ర ప్రతినిధులతో జూడాల సమస్యలు, డిమాండ్లపై చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా మంత్రి జూనియర్ డాక్టర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో అసోసియేషన్ ప్రతినిధులు సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించారు.

నేటి నుంచి విధుల్లోకి..
సమ్మె విరమించడంతో జిల్లాలోని జూనియర్ డాక్టర్లు గురువారం నుంచి విధుల్లోకి వెళ్లనున్నారు. తమ సమస్యలపై సానుకూలంగా స్పందించడంతో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చంద్రకాంత్ వైద్యారోగ్యశాఖ మంత్రి, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

సొసైటీల బలోపేతానికి చర్యలు

- రైతుబీమా రూ. 2 లక్షలకు పెంపు
- ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి
- రూ. 2లక్షల రుణమాఫీ ప్రకటనపై సీఎంకు కృతజ్ఞతలు



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి

సుభాష్‌నగర్: సహకార సంఘాల బలోపేతానికి చర్యలు చేపడతామని డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నగరంలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ప్రధాన కార్యాలయంలో వార్షిక మహాజన సభ నిర్వహించారు. సీఈవో నాగభూషణం వందే బ్యాంకు నివేదికను చదివి వినిపించారు. ఏకకాలంలో రూ. 2 లక్షల రుణమాఫీ ప్రకటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి డీసీసీబీ, రైతుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ బ్యాంకు ఏర్పడి వందేళ్లవుతున్న సందర్భంగా శతాబ్ది ఉత్సవాలను నిర్వహించేందుకు రాష్ట్ర సహకారశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసి త్వరలోనే తేదీని ప్రకటిస్తామని తెలిపారు. రైతుల రుణమాఫీకి సంబంధించి ఉమ్మడి జిల్లాలోని రైతుల వివరాలను ఇప్పటికే టెస్కాబ్‌కు పంపించామన్నారు. మొండి బకాయిల వసూళ్లపై బ్యాంకు సిబ్బందికి సొసైటీ చైర్మన్లు, స్థానిక ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. ఎస్ఏవో రుణాల పరిమితి రూ. 2 లక్షలకు పెంచేందుకు మహాజన సభలో తీర్మానం చేస్తామన్నారు. అసైన్‌మెంట్ భూములకు పంట రుణం విషయంలో సొసైటీల చైర్మన్ల అభిప్రాయం మేరకు బ్యాంకు చైర్మన్ సానుకూలంగా స్పందించారన్నారు. మార్క్‌ఫెడ్ నుంచి సొసైటీలకు ఎరువుల కొనుగోళ్ల కోసం క్రెడిట్ ఇచ్చేలా తీర్మానించి రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో మార్క్‌ఫెడ్ రాష్ట్ర చైర్మన్ మార గంగారెడ్డి, ఐడీసీఎంఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, బ్యాంకు డైరెక్టర్లు, ఐడీసీఎంఎస్ డైరెక్టర్లు, ఉమ్మడి జిల్లాలోని సొసైటీల చైర్మన్లు, బ్యాంకు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాధితులకు న్యాయం జరిగేలా చూడాలి



కామారెడ్డి టౌన్‌: జిల్లాలోని కోర్టులో విధులు నిర్వహించే కోర్టు కానిస్టేబుళ్లకు ఎస్పీ కార్యాలయంలో అదనపు ఎస్పీ కె నరసింహా రెడ్డి బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ కోర్టు ఏపీపీవో అశోక్ శివరాంతో కలిసి కోర్టు విధులు, విధానాలపై అవగాహన కల్పించారు. కోర్టుకు వచ్చే బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు.కార్యక్రమంలో కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం తనిఖీ



తాడ్వాయి: మండల కేంద్రంలోని ఆధార్ కేంద్రాన్ని ఆధార్ రాష్ట్ర ప్రాజెక్టు మేనేజర్ నరేశ్ చంద్ర బుధవారం తనిఖీ చేశారు. ఆధార్ కేంద్రాల్లో ఆధార్ కార్డులు పొందిన వారి కార్డులు డియాక్టివేట్ అవుతున్నట్లు తమ దృష్టికి రావడంతో పలు జిల్లాల్లోని ఆధార్‌కేంద్రాలను పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. కొంత మంది బాధితులతో మాట్లాడి సమస్యలు పరిష్కారం అయ్యేలా చూస్తున్నట్లు వెల్లడించారు. ఆధార్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకునేటప్పుడు ఫేక్ సర్టిఫికేట్లు జతచేయడం, వేలిముద్రలు సరిగా తీసుకోకపోవడంతో ఇలాంటి సమస్యలు వస్తున్నాయన్నారు. ఆయన వెంట ఈడీఎం ప్రవీణ్‌కుమార్, నిర్వాహకులు సునీల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

వ్యవసాయశాఖలో సభ్యత్వ నమోదు



కామారెడ్డి అర్బన్‌: తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం 2024–25 సభ్యత్వ స్వీకార కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లోని వ్యవసాయశాఖ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి, కార్యదర్శి బి.సాయిలు బుధవారం నిర్వహించారు. వ్యవసాయ శాఖ ఉద్యోగులు టీఎన్జీవోస్ సభ్యత్వం పొందారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్‌కుమార్, మనోజ్‌కుమార్, శివకుమార్, ఎం కిషన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

భిక్కనూరు: వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని లింక్ వర్కర్ స్కీం డీఆర్పీ సుధాకర్ అన్నారు. మండలంలోని జంగంపల్లిలో ఉన్న పల్లె దవాఖానలో వైఆర్‌జీ కేర్ లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. వలస కార్మికులతో ప్రత్యేకంగా సమావేశమై, వారికి ఆరోగ్య సలహాలు అందించారు. అనంతరం పల్లె దవాఖానలో 64 మందికి వివిధ రకాల వ్యాధులకు సంబంధించి రక్త పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి బాబు, ఏఎన్ఎంలు జ్యోతి, శ్రీలత, లింక్ వర్కర్ శివరాం, ఆశావర్కర్లు రేణుక, విజయలక్ష్మి, అనిత, మంజుల, కవిత పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన జుక్కల్ ఎమ్మెల్యే



కామారెడ్డి టౌన్‌: జిల్లాకు నూతనంగా వచ్చిన కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్‌ను జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే కోరారు. నియోజకవర్గ సమస్యలపై చర్చించారు.

జోరందుకున్న పేకాట!

పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు నగరంలోని ఓ ఇంటిపై 15రోజుల క్రితం సంబంధిత పోలీస్‌స్టేషన్ సిబ్బంది దాడి చేశారు. పోలీసులు వచ్చారనే భయంతో పేకాటరాయుళ్లు పారిపోవడానికి ప్రయత్నించారు. ఓ వ్యక్తి బంగ్లాపై నుంచి దూకడంతో కాలు విరిగినట్లు తెలిసింది. ఈ ఘటనను పోలీసులు గోప్యంగా ఉంచారు. మొత్తం 13 మందిపై కేసులు నమోదు చేసినట్లు సమాచారం.

మాక్లూర్ మండలంలోని ఓ గ్రామం పరిధిలో రైల్వే బిడ్జి వద్ద పేకాట కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. నిజామాబాద్ నుంచి పేకాటరాయుళ్లను తీసుకువెళ్లి అక్కడ పేకాట ఆడించేవారు. ఈ విషయం బయటకు పొక్కడంతో నిర్వాహకులు తమ మకాంను మహారాష్ట్రలోని బిలోలికి మార్చారు.

- జిల్లాలో ఎక్కడికక్కడ స్థావరాలు
- హోటళ్లు, అపార్ట్‌మెంట్‌లలో అడ్డాలు!
- పేకాటరాయుళ్లకు వరమైన పోలీసుల ఎన్నికల విధులు



ఖలీల్‌వాడి: జిల్లాలో పేకాట జోరుగా సాగుతోంది. కొన్ని రోజులపాటు మిన్నకుండిపోయిన పేకాటరాయుళ్లకు శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల కాలం వరంలా మారింది. ఎన్నికల విధుల్లో పోలీసులు బిజీగా ఉండడంతో అప్పటి నుంచి పేకాటస్థావరాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్‌లలో జోరుగా పేకాట సాగుతోంది.

అడ్డాలు ఇవే..

పేకాటస్థావరాల నిర్వాహకులు పట్టణ ప్రాంతాల్లోని శివారు కాలనీలు, రద్దీ ప్రాంతాలతోపాటు ప్రధాన హోటళ్లను అడ్డాలుగా చేసుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ క్షేత్రాలు, అటవీ ప్రాంతాలు, ఈత, తాటి వనాల్లో పేకాట జోరుగా సాగుతోందనే సమాచారం. అలాగే అపార్ట్‌మెంట్‌లు, హోటళ్లు, లాడ్జీలు, కొందరు రాజకీయ నాయకులు, బడా వ్యాపారుల ఇళ్లు పేకాటకు అడ్డాగా మారాయి. పేకాటస్థావరాలపై దాడులు చేసిన పోలీసులు పలు సందర్భాల్లో రాజకీయ నాయకుల ఒత్తిళ్ల కారణంగా వదిలేసిన సందర్భాలున్నాయని పలువురు పేర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ.500 నుంచి రూ.5వేల వరకు పేకాట ఆడుతున్నారు. కాకతీయ కాలువ ప్రాంతాల్లో రౌండ్‌కు కనీసం రూ.వెయ్యి ఉండాల్సిందే. నగరంలోని కొన్ని ప్రాంతాల్లో టేబుల్‌కు రూ.5వేల నుంచి రూ.10వేల వరకు ఆడుతున్నట్లు సమాచారం.

కారు, వసతి అన్నీ వారివే..

మరికొందరు పేకాటస్థావరాల నిర్వాహకులు పేకాటరాయుళ్లను ఏకంగా జిల్లాకు పొరుగునే ఉన్న కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు తీసుకెళ్తున్నారు. కారులో తీసుకెళ్లి అక్కడ అన్ని వసతులు కల్పించి పేకాట ఆడిస్తున్నారు. జిల్లా నుంచి మహారాష్ట్రలోని బోరి, చంద్రాపూర్, పాండర్‌కౌడ, దెగ్లూర్, బిలోలి ప్రాంతాలకు వందలాది మంది పేకాటరాయుళ్లను తీసుకెళ్తున్నట్లు తెలుస్తోంది. అలాగే కర్ణాటకలోని బళ్లారి, బెంగళూరు ప్రాంతాలకు సైతం వెళ్లి పేకాట ఆడుతున్నారు.

టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రాజశేఖర్‌రాజు బదిలీతో..

ఓవైపు పార్లమెంట్ ఎన్నికలకు ముందు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రాజశేఖర్‌రాజు బదిలీ కావడం, పోలీసులు ఎన్నికల విధుల్లో బిజీగా మారడం.. పేకాటరాయుళ్లకు వరంలా మారింది. ఏసీపీ రాజశేఖర్‌రాజు నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పేకాటస్థావరాలపై విస్తృతంగా దాడులు చేసి కేసులు నమోదు చేశారు. దంతో పేకాట ఆడాలంటేనే వెనుకాముందు ఆలోచించారు. ఏసీపీ బదిలీ కావడం, ఎలక్షన్ విధుల్లో పోలీసులు బిజీగా మారడంతో పేకాటమళ్లీ జోరందుకుంది.

సమాచారం అందించండి

పేకాటస్థావరాలు కొనసాగితే స్థానిక పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100కు సమాచారం అందించాలి. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం. పేకాట ఆడి దొరికితే కేసులు నమోదు చేస్తాం. ఇప్పటికే హోటళ్ల నిర్వహకులకు నోటీసులు అందించాం.

– రాజావెంకటరెడ్డి, ఏసీపీ, నిజామాబాద్

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి సునీత కుంచాల, డీఎల్ఎస్ఏ కార్యదర్శి పద్మావతి, డాక్టర్ విశాల్

- జిల్లా జడ్జి సునీత కుంచాల
- మాదకద్రవ్యాల నివారణపై అవగాహన ర్యాలీ

ఖలీల్‌వాడి: యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని జిల్లా జడ్జి సునీత కుంచాల అన్నారు. డ్రగ్స్‌కు అలవాటు పడితే జీవితం నాశనమవుతుందని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ గ్రౌండ్ నుంచి బుధవారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల నివారణ దినోత్సవంలో భాగంగా డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీఎల్ఎస్ఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జడ్జి మాట్లాడారు. గంజాయి, ఇతర మత్తుపదార్థాలకు యువకుత బానిసలుగా మారి దొంగతనాలు, హత్యలకు పాల్పడే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఏం చేస్తున్నారని నిరంతరం గమనించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి పద్మావతి, డాక్టర్ విశాల్, జీజీహెచ్ సూపరిండెంట్ ప్రతిమారాజ్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి పురుషోత్తంగౌడ్, బార్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాలుడిని రైలులో వదిలేశారు

చైల్డ్ వెల్ఫేర్ హోమ్‌కు తరలింపు



చైల్డ్ వెల్ఫేర్ హోమ్‌లో బాలుడు

కామారెడ్డి టౌన్‌: రెండేళ్ల బాలుడిని గుర్తు తెలియని వ్యక్తులు రైలులో వదిలేసి వెళ్లిన ఘటన బుధవారం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. గుర్తు తెలియని రెండేళ్ల బాలుడు కామారెడ్డి రైల్వే స్టేషన్ పరిధిలోని వడియారం రైల్వే స్టేషన్‌లో రైలు ఆగిన సమయంలో ఏడుస్తూ ఉండటాన్ని తోటి ప్రయాణికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. సదరు బాలుడిని కామారెడ్డి రైల్వే పోలీసులు ఆధీనంలోకి తీసుకుని విచారణ జరిపారు. అతని వివరాలు తెలియరాలేదు. బాలుడు ఎవరు అనేది విచారణ జరుపుతున్నారు. బాలుడిని కామారెడ్డి చైల్డ్ హోంకు తరలించారు. విచారణ జరపుతున్నామని ఎస్ఐ సాయిరెడ్డి తెలిపారు. బాలుడి వివరాలు తెలిసినవారు రైల్వే పోలీసులను లేదా 8712658591 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

గొర్రెల మందపై చిరుత దాడి..



మోపాల్: మోపాల్ మండలంలోని ఎల్లమ్మకుంట శివారులో మంగళవారం సాయంత్రం గొర్రెల మందపై చిరుత దాడి చేసి ఓ గొర్రెను లాక్కెళ్లడానికి ప్రయత్నించింది. గొర్రెల కాపారులు కేకలు వేయడంతో చిరుత గొర్రెను వదిలి అటవీ ప్రాంతంలోకి పారిపోయింది. సమాచారం మేరకు ఘటనాస్థలానికి చేరుకున్న అటవీ అధికారులు, పశువైద్యాధికారికి సమాచారమిచ్చారు. చిరుత సంచారంతో ఎల్లమ్మకుంట, అమ్రాబాద్, బైరాపూర్, కాల్పోల్ గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అటవీ అధికారులు వెంటనే చిరుతను బంధించాలని కోరుతున్నారు. పంట పొలాలకు వెళ్లడానికి స్థానికులు, రైతులు జంకుతున్నారు.

ప్రతి విద్యార్థి దేశభక్తి కలిగి ఉండాలి



భిక్కనూరు: ప్రతి విద్యార్థి దేశభక్తి కలిగి ఉండాలని పెద్ద మల్లారెడ్డి ఎంపీటీసీ సభ్యుడు కొడూరి సాయాగౌడ్ అన్నారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఎన్‌సీసీ విద్యార్థులకు సర్టిఫికెట్లను బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ప్రసన్న దేవి, ఎన్‌సీసీ అధికారి అనిల్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



గంగాధర్ (ఫైల్)

మాక్లూర్: బైక్ అదుపుతప్పి ఘటనలో గాయాలపాలైన వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మాక్లూర్ ఎస్సై సుధీర్‌రావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని చిక్లి గ్రామానికి చెందిన సీహెచ్ గంగాధర్(48) పని నిమిత్తం మంగళవారం సాయంత్రం బైక్‌పై బయటకి వెళ్లి తిరిగి రాత్రి 11 గంటలకు ఇంటికి వెళ్తుండగా గ్రామ శివారులో బైక్ అదుపు తప్పింది. ఈ ఘటనలో గంగాధర్‌కు తీవ్రగాయాలు కాగా వాహనదారులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. బాధితుడిని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి భార్య రుక్మిణిబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి

ఖలీల్‌వాడి: రైలులో నుంచి జారిపడి నగరంలోని దుబ్బ ప్రాంతానికి చెందిన బుక్క స్వామి(22) మృతి చెందినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి బుధవారం తెలిపారు. డిచ్‌పల్లి – ఇందల్వాయి స్టేషన్‌ల మధ్యలో మంగళవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటు చేసుకుందని, గుర్తు తెలియని రైలులో నుంచి ప్రమాదవశాత్తు స్వామి పడిపోవడంతో తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి దహనం



గంజాయి దహనాన్ని పరిశీలిస్తున్న రైల్వే ఎస్పీ చందనాదీప్తి

ఖలీల్‌వాడి: డ్రగ్ దుర్వినియోగం, అక్రమ రవాణ వ్యతిరేక అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా గంజాయిని రైల్వే ఎస్పీ చందనాదీప్తి సమక్షంలో దహనం చేసినట్లు నిజామాబాద్ రైల్వే ఎస్సై సాయిరెడ్డి బుధవారం తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కేసుల్లో పట్టుకున్న 1500 కేజీల గంజాయిని భువనగిరిలో దహనం చేయగా, నిజామాబాద్ రైల్వేస్టేషన్ పరిధిలో పట్టుబడిన 25కిలోల గంజాయి ఉన్నట్లు పేర్కొన్నారు. గంజాయికి యువత దూరంగా ఉండాలని, జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్సై కోరారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి

కామారెడ్డి టౌన్‌: జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అధిక ఫీజుల విషయమై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి, పీడీఎస్‌యూ, వీజేఎస్, ఏఐఎఫ్‌డీఎస్, ఏఐఎఫ్‌డీవై సంఘాల నాయకులు నాగరాజు, జబ్బర్‌నాయక్, లక్ష్మణ్‌యాదవ్, సతీశ్, వినోద్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్జీటీల బదిలీలు పారదర్శకంగా చేపట్టాలి

కామారెడ్డి టౌన్‌: జిల్లా వ్యాప్తంగా ఎస్జీటీ ఉపాధ్యాయుల బదిలీలు పారదర్శకంగా చేపట్టాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నాయకులు డీఈవో రాజును బుధవారం కోరారు. కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షుడు పుల్గం రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి సంతోష్ పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగి ఆరోగ్యంగా ఉండాలి

కామారెడ్డి టౌన్‌: ప్రతి ఉద్యోగి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని జిల్లా విద్యుత్‌శాఖ అధికారి రమేశ్ బాబు అన్నారు. జిల్లా కేంద్రంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో విద్యుత్ ఉద్యోగుల కోసం ఓ కార్పొరేట్ ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఉద్యోగులకు వైద్య సిబ్బంది పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టెక్నికల్ డీఈ నాగరాజు, సంపత్, ఉద్యోగులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

ఖలీల్‌వాడి: నగరంలోని పులాంగ్ ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా అర్ధరాత్రి వరకు దుకాణాలు తెరిచి ఉంచిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సంజీవ్ బుధవారం తెలిపారు. ఒకరు కిరాణా దుకాణం, మరొకరు హోటల్ తెరిచి ఉంచడంతో ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కాపర్ చోరీ

బోధన్‌రూరల్: మండలంలోని ఎరాజ్‌పల్లికి చెందిన గంగారెడ్డి అనే రైతు వ్యవసాయ పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్‌ను దుండగులు ధ్వంసం చేసి కాపర్ ఎత్తుకెళ్లారు. విద్యుత్ శాఖ ఏఈ కల్యాణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ బుధవారం తెలిపారు.

మహిళా సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



మాట్లాడుతున్న సెర్ప్ డీపీఎం వకుళ

నాగిరెడ్డిపేట: మహిళా సంఘాల సభ్యులకు బ్యాంకు, స్త్రీనిధి తదితర ఆర్థిక సంస్థల ద్వారా రుణాలు ఇప్పించి ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చూడాలని సెర్ప్ డీపీఎం వకుళ సూచించారు. మండలకేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో వీవోఏలతో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన మహిళాశక్తి కేంద్రాలకు అర్హులైన లబ్ధిదారులను గుర్తించి మహిళల జీవితాల్లో వెలుగులు నింపాలన్నారు. సంఘాల లోకోస్ డాటా ఎంట్రీ ప్రక్రియను త్వరతగతిన పూర్తి చేయాలన్నారు. ఏపీఎం జగదీశ్ మాట్లాడుతూ.. వీవోఏలు గ్రామాల్లోని సంఘాల్లో అర్హులైన సంఘ సభ్యులను గుర్తించి వారికి జీవనోపాదుల పెంపునకు బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు ఇప్పించి మెరుగైన జీవనవిధానం చేపట్టేలా చూడాలన్నారు. పీఎంఈజీపీ పథకం ద్వారా 35శాతం సబ్సిడీతో వివిధ వ్యాపారాలు చేసేందుకు ఆసక్తి ఉన్న సభ్యులను గుర్తించి వారికి తగిన శిక్షణ ఇప్పించాలన్నారు. దీంతోపాటు స్త్రీనిధి రుణాల మొండి బకాయిలను రికవరీ చేసి కొత్తరుణాలను ఇప్పించాలన్నారు. సమావేశంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు బేస్త శాంత, సెర్ప్ ఏపీఎం రాజేందర్, స్త్రీనిధి రీజనల్ మేనేజర్ కిరణ్, సీసీలు దత్తు, నారాయణ, రమేశ్, సాయిలు, రషీద్, శ్రీనివాస్‌రెడ్డి, సుజాత, అకౌంటెంట్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి

- ఎస్పీ సింధు శర్మ



మాట్లాడుతున్న ఎస్పీ సింధు శర్మ

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పోలీస్ డివిజన్ పరిధిలో పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎస్పీ సింధు శర్మ పోలీసు అధికారులకు సూచించారు. ఎల్లారెడ్డి డీఎస్పీ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. డివిజన్ పరిధిలో పెండింగ్ కేసులు లేకుండా చూడాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరుగకుండా ఉండేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. మూల మలుపుల వద్ద ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రాన్స్‌ఫార్మర్లకు సంబంధించిన కాయిల్స్, ఆయిల్ చోరీలు జరగకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నర్సింహారెడ్డి, డీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు రవీందర్‌నాయక్, సంతోష్‌కుమార్, ఎస్సైలు మహేశ్, చైతన్యకుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

డీవీకే ఆశయాలు కొనసాగిద్దాం



మాట్లాడుతున్న ఆలిండియా కార్యదర్శి ప్రదీప్‌సింగ్ ఠాగూర్, పాల్గొన్న నాయకులు వనమాల కృష్ణ, ప్రభాకర్

ఖలీల్‌వాడి: డి వి కృష్ణ ఆదర్శ కమ్యూనిస్టు అని, విప్లవోద్యమానికి, ఆయన చేసిన కృషి మరువలేనిదని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆలిండియా కార్యదర్శి ప్రదీప్ సింగ్ ఠాగూర్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని రేడియో స్టేషన్ ఎదురుగా డీవీకే నగర్‌లో డీవీ కృష్ణ స్మారక స్థూపావిష్కరణ చేశారు. ఆయన మాట్లాడుతూ.. డీవీకే సైద్ధాంతిక, రాజకీయ రంగాలన్నింటినీ నిశితంగా పరిశీలన చేసి సరైన సిద్ధాంతం కోసం మొక్కవోని పోరాటం చేశారన్నారు. కృష్ణ ఆశలు, ఆకాంక్షలు, ఆశయాలు ఉన్నతమైనవన్నారు.

కార్యక్రమంలో నాయకులు వనమాల కృష్ణ, పోటు రంగారావు, భాస్కర్ రావు, వేములపల్లి వెంకట్రామయ్య, యాదగిరి, రాంచందర్, రమ, ప్రభాకర్, ఎం నరేందర్, పి రామకష్ణ, బి దేవారాం, ఎం వెంకన్న, రాజేశ్వర్, అల్గోట్ రవీందర్, ఎం సుధాకర్, వి గోదావరి, సంధ్యారాణి, ఎం ముత్తెన్న, సాయాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



అవగాహన ర్యాలీలో పాల్గొన్న డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్, సిబ్బంది

నిజామాబాద్‌నాగారం: విద్యార్థి దశ నుండే చక్కని ఆరోగ్యకరమైన అలవాట్లను అలవర్చుకోవాలని, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి తుకారాం రాథోడ్ అన్నారు. డ్రగ్ దుర్వినియోగం, అక్రమ రవాణ వ్యతిరేక అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా నగరంలోని సీతారాంనగర్ కాలనీలో బుధవారం వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా ఆరోగ్య విద్య బోధకులు ఘన్ పూర్ వెంకటేశ్వర్లు, డీపీహెచ్ఎన్‌వో స్వామి సులోచన, హెచ్ఈవో నాగరాజు, హాస్టల్ వార్డెన్లు రాము లు, రేఖ, మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాల హెచ్ఎం పాపయ్య, కళాశాల ప్రిన్సిపల్ అరుణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బలవంతంగా స్కూళ్లను బంద్ చేయిస్తే కేసులు

ఖలీల్‌వాడి: విద్యా సంస్థలను ఎవరైనా బలవంతంగా బంద్ చేయిస్తే కేసులు నమోదు చేస్తామని సీపీ కల్మేశ్వర్ బుధవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. బంద్ పిలుపు మేరకు ఆయా విద్యా సంస్థల యాజమాన్యాలు స్వచ్ఛందంగా బంద్ పాటిస్తే పర్వాలేదని,కానీ బలవంతంగా విద్యా సంస్థలను మూసివేయిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లకు సమాచారం అందించాలని విద్యా సంస్థల యాజమాన్యాలకు సూచించారు. ఇదిలా ఉండగా, బుధవారం జిల్లాలో స్కూళ్లు, కాలేజీలను బంద్ చేయించిన పలువురు ఏబీవీపీ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

రైలు కిందపడి వ్యక్తికి తీవ్రగాయాలు

- తెగిన కాలు, నుజ్జునుజ్జయిన చేయి
- డిచ్‌పల్లి రైల్వేస్టేషన్‌లో ఘటన



రైలు కిందపడిన విష్ణు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): కదులుతున్న రైలులో నుంచి దిగే క్రమంలో ఓ వ్యక్తి అదుపుతప్పి రైలు బోగి, ప్లాట్‌ఫామ్ మధ్య పడిపోయాడు. ఈ ఘటనలో సదరు వ్యక్తి ఎడమకాలు తెగిపోగా, ఎడమచేయి పూర్తిగా దెబ్బతిన్నది. హృదయవిదారకమైన ఈ ఘటన డిచ్‌పల్లి రైల్వేస్టేషన్‌లో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు, 108 అంబులెన్స్ సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మహారాష్ట్రలోని నాందెడ్‌కు చెందిన విష్ణు (55) సుమారు 40 ఏళ్ల క్రితం డిచ్‌పల్లికి వచ్చి స్థిరపడ్డాడు. రైళ్లలో చిరుతిళ్లు (మరమరాలు, పల్లీలు, శనగలు) విక్రయిస్తూ జీవించే విష్ణు.. రోజులాగే బుధవారం నిజామాబాద్ నుంచి సికింద్రాబాద్‌కు వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలులో ఎక్కాడు. క్రాసింగ్ కారణంగా డిచ్‌పల్లి రైల్వే స్టేషన్‌లో ఆగిన రైలు తిరిగి బయల్దేరింది. ఈ క్రమంలో వేరే బోగిలోకి వెళ్లేందుకు కదులుతున్న రైలులోనుంచి విష్ణు కిందకు దిగుతుండగా అదుపుతప్పి పడిపోయాడు. గమనించిన స్థానికులు కేకలు వేయడంతో ప్రయాణికులు చైన్ లాగడంతో రైలు నిలిచింది. అప్పటికే రైలు చక్రాలు పైనుంచి వెళ్లడంతో విష్ణు ఎడమ కాలు తెగిపోగా, ఎడమ చేయి నుజ్జునుజ్జయ్యింది. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది హుటాహుటిన రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. అంబులెన్స్ ఈఎంటీ ఎం సురేశ్, పైలట్ కిషన్ రైలుకింద ఇరుక్కున్న విష్ణును సకాలంలో జాగ్రత్తగా బయటకు తీసి ప్రాణాలను కాపాడారు. తెగిన కాలుతో సహా విష్ణును వెంటనే జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. విష్ణు కొడుకు డిచ్‌పల్లి రైల్వే స్టేషన్ సమీపంలోని ఓ హోటల్‌లో పని చేస్తుంటాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నీళ్లు కావాలని అడిగి చైన్‌స్నాచింగ్

ఖలీల్‌వాడి: నీళ్లు కావాలని ఇంట్లోకి వెళ్లిన దుండగుడు వృద్ధురాలి మెడలోని మూడు తులాల బంగారం గొలుసును ఎత్తుకెళ్లాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. నగరంలోని నాందేవ్‌వాడకు చెందిన చిన్నుబాయి బుధవారం హైదరాబాద్ నుంచి నిజామాబాద్‌కు వచ్చింది. బస్టాండ్ నుంచి ఆటోలో నాందేవ్‌వాడలోని తన ఇంటికి ఆమె రాగా, అదే ఆటోలో వచ్చిన మరో వ్యక్తి వృద్ధురాలి వెనకాలే ఇంట్లోకి వెళ్లి నీళ్లు అడిగి ఆమె మెడలోని బంగారు గొలుసును ఎత్తుకెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.